సాక్షి చిత్తూరు

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



కాణిపాకం కిటకిట

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దీంతో స్వామివారి దర్శనానికి ఐదు గంటల సమయం పడుతోంది.



తిరుమలలో వర్షం

తిరుమల : తిరుమలలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి వర్షం పడింది. సుమారు అర గంట పాటు వర్షం కురవడంతో భక్తులు తడిసి ముద్దయ్యారు.

అరుదైన సీతాకోక చిలుక



తిరుపతిలోని సుందరయ్యనగర్‌లో ఆదివారం అరుదైన సీతాకోక చిలుక కనువిందు చేసింది. దీన్ని పలువురు ఆసక్తిగా చూడడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జేసీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా కలవాలని చెప్పారు.

తుంబురుతీర్థ ముక్కోటికి ముమ్మర ఏర్పాట్లు

తిరుమల : తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఇందులో పాల్గొనేందుకు ఈ నెల 5న ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటల వరకు, 6వ తేదీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భక్తులను అనుమతించనున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలో పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రాదాలు, తాగునీరు అందించనున్నట్లు తెలిపింది. తీర్థానికి చేరుకునేందుకు ఎక్కువ దూరం నడవాల్సి ఉన్నందున గుండె, శ్వాసకోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించమని స్పష్టం చేసింది. పోలీసులు, అటవీశాఖ, సమన్వయంతో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు వివరించింది.

నేటి నుంచి శ్రీవారి వసంతోత్సవాలు

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి వారు నాలుగు మాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన తర్వాత తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండవ రోజు ఏప్రిల్ 4న శ్రీభూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. చివరిరోజు ఏప్రిల్ 5న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 4న అష్టదళ పాదపద్మారాధన, సోమవారం నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

చిరు జిల్లాకు తొలి వసంతం

చిరు చిత్తూరు జిల్లా దిగ్విజయంగా తొలి వసంతం పూర్తి చేసుకుంది. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న 112 సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పెద్ద జిల్లా మూడుగా విడిపోయింది. 66 మండలాలతో సువిశాలంగా ఉండే చిత్తూరు జిల్లా పునర్విభజన ప్రక్రియతో 31 మండలాల చిరు జిల్లాగా మారిపోయింది. సరికొత్త జిల్లాగా రూపాంతరం చెందింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం మేరకు పరిపాలన ప్రజలకు చేరువైంది. పర్యవేక్షణ సులభతరమైంది. పథకాల అమలు పకడ్బందీగా సాగుతోంది. ప్రజలకు పాలనపై అవగాహన పెరిగింది.



చిత్తూరు జిల్లా స్వరూపం

విస్తీర్ణం	6,859 చ.కి.మీ
మండలాలు	31
గ్రామాలు	5,228
రెవెన్యూ గ్రామాలు	822
గ్రామ పంచాయతీలు	697
అసెంబ్లీ నియోజకవర్గాలు	07
పార్లమెంట్ నియోజకవర్గాలు	01
మునిసిపాలిటీలు	05
జనాభా	18.73 లక్షలు
పురుషులు	9.40 లక్షలు
మహిళలు	9.33 లక్షలు
పట్టణ జనాభా	3.69 లక్షలు
గ్రామీణ జనాభా	15.04 లక్షలు

- 66 నుంచి 31 మండలాల సరికొత్త జిల్లాగా రూపాంతరం
- ప్రజలకు చేరువైన పరిపాలన
- అభివృద్ధి వేగవంతం
- పర్యవేక్షణ సులభతరం



చిత్తూరు జిల్లా చిత్రపటం

సాక్షి, చిత్తూరు : ప్రజలందరికీ పరిపాలనను చేరువ చేసేందుకు జిల్లాల పునర్విభజన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. 2022 ఏప్రిల్ 3వ తేదీన కొత్త జిల్లాల్లో పాలనా ప్రక్రియక మొదలై, నేటికి ఒక సంవత్సరం అయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో కొన్నింటిని తిరుపతి జిల్లాకు, మరికొన్నింటిని అన్నమయ్య జిల్లాలో కలిపారు. అనంతరం 31 మండలాల గల చిత్తూరు జిల్లా నూతనంగా ఏర్పాటైంది. ఈ జిల్లాతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

37 సంవత్సరాల తర్వాత....

గతంలో ఉన్న తాలుకాలను 1985వ సంవత్సరంలో రెవెన్యూ మండలాలుగా ఏర్పాటు చేశారు. అప్పట్లో 66 మండలాలను చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేశారు. 66 మండలాలతో ఏర్పాటైన అతిపెద్ద చిత్తూరు జిల్లా 37 సంవత్సరాల తర్వాత చిరు జిల్లాగా రూపాంతరం చెందింది. ప్రజల కష్టాలను తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలను పునర్వ్యవస్థీకరించింది.

నూతన రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు

చిత్తూరు జిల్లా పరిధిలో కొత్తగా కుప్పం, నగరి, పలమనేరు రెవెన్యూ డివిజన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించింది. కుప్పం, పలమనేరు ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గతంలో మదనపల్లెకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సమస్యలను ఉన్న చోటనే సులువుగా పరిష్కరించుకోగలుగుతున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ సులభతరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉన్నతాధికారులు సులభంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందజేయాలంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరం. జిల్లా అధికారులు గతంలో క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలంటే దూరాభారం కావడం కాస్త ఇబ్బంది కలిగించేది. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దులో ఉన్న పెద్దతిప్పసముద్రం మండలానికి వెళ్లాలంటే 141 కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉండేది. దీంతోపాటు ఇటువైపు సత్యవేడుకు వెళ్లాలంటే 118 కిమీ. వెళ్లాల్సి వచ్చేది. అధికారులకు ఒకరోజు సమయం అంతా వృథా అయ్యేది. అలాగే ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి తమ సమస్యలు చెప్పుకోవాలన్న వ్యయప్రయాసలకు లోనయ్యేవారు. ఇటువంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం హర్షనీయమని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యటనకు వెసులుబాటు



పరిపాలనను ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. చిత్తూరు జిల్లా పరిధిలోని 31 మండలాల్లో పర్యవేక్షణ సులభతరంగా మారింది. దూరాభారం తగ్గడంతో క్షేత్రస్థాయి పర్యటనలు ముమ్మరంగా చేసేందుకు వెసులుబాటు కలిగింది. పారిశ్రామికవేత్తలు చిత్తూరు జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– హరి నారాయణన్, కలెక్టర్, చిత్తూరు.

అందుబాటులో ఆర్డీవో కార్యాలయం



జిల్లాల విభజనతో నగరి డివిజన్‌గా మారింది. నగరిలోనే ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటైంది. ఇది వరలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. అలా వెళ్లి రావాలంటే ఒకరోజు గడిచిపోయేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. చిత్తూరుకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయి. భూ సంబంధిత సమస్యలు నగరిలోనే పరిష్కరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. – శ్రీనివాసులు, రైతు, మాంగాడు, నగరి మండలం

ఇప్పుడు ఆ సమస్య లేదు



జిల్లాల విభజన తర్వాత పలు కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. నగరి డివిజన్‌గా మారింది. నగరి పట్టణంలో ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం వంటి నూతన కార్యాలయాలు వచ్చాయి. ఇదివరకు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాలంటే చిత్తూరుకు, డీఎస్పీ కార్యాలయానికి వెళ్లాలంటే పుత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు అందుబాటులోనే ఉన్నాయి.

– జ్యోతి, విజయపురం మండలం

ప్రజలంతా జగనన్న వెంటే



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి రోజా



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- చంద్రబాబు కుతంత్రాలు పనిచేయవు
- 'జగనన్నే మా భవిష్యత్'లో మంత్రి రోజా

నగరి: రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కుతంత్రాలు ఏవీ పనిచేయవని, టీడీపీ ఆరిపోయే దీపమని పేర్కొన్నారు. నగరిలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో ఆదివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నేడు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉందంటే అది కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణమన్నారు. జగనన్న లాంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమన్నారు. ప్రజల మన్ననలు పొందిన ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత వారికన్నా మరింత ప్రజాభిమానాన్ని పొందిన ఏకైక ప్రజానాయకుడు జగనన్నే అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసి, ఆ తర్వాత దానిని పక్కకు పడేస్తాయని చెప్పారు. అయితే జగనన్న మాత్రం తాను విడుదల చేసిన మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంలా భావించి 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని ప్రజలకు అందించడం అందరినీ ఆశ్చర్యపరిచే అంశమన్నారు. ఇలాంటి మనసున్న, ధైర్యవంతుడైన సీఎంను మనం మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అభివృద్ధి పనులు మంజూరు

నగరిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మొక్కల కండ్రిగ ప్రాజెక్టును రెండేళ్ల పాటు శ్రమించి సాధించానని మంత్రి స్పష్టం చేశారు. సర్వే జరుగుతోందని, త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మున్సిపాలిటీలో ఒక పార్కును సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపాన్ని బుగ్గఅగ్రహారం వద్ద నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమైనట్లు వివరించారు. ఎలక్ట్రికల్ బర్నింగ్ శ్మశాన వాటికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇలా అన్ని వర్గాల వారికి సంక్షేమం, అభివృద్ధి పనులు చేస్తున్న వైఎస్సార్‌సీపీ వెంటే ప్రజలు ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదన్నారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, శంకర్, జయప్రకాష్, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ఎస్సీల మధ్య గొడవలు పెట్టి విడదీసిన దళిత ద్రోహి చంద్రబాబు అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1984 లో పాదిరి కుప్పం ఎస్సీవాడలో టీడీపీకి ఓటు వేయలేదన్న నెపంతో గ్రామాన్ని తగలబెట్టిన చరిత్ర చంద్రబాబుది అని, అదేవిధంగా కారంచేడు ఘటన, రామచంద్రపురం మండలంలో 12 గ్రామాల్లో దళితులకు ఓటు హక్కు లేకుండా చేసింది టీడీపీ కాదా.. అని విమర్శించారు. హైదరాబాదులోని వైస్రాయ్ హోటల్లో ఈనాడు అధినేత రామోజీరావుతో కలిసి ఎమ్మెల్యేల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టి దేశ రాజకీయాలను భ్రష్టు పట్టించింది చంద్రబాబేనని ఆరోపించారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావు మరణానికి కారకుడై, ఆయన స్థాపించిన టీడీపీని లాక్కొని ఆయన పథకాలను రద్దు చేసిన చరిత్ర చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మార్గదర్శి అక్రమాలు వెలుగులోకి రావడంతో వాటిని కప్పిపుచ్చుకోవడం కోసం రామోజీరావు ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో, బోగస్ కంపెనీల కుంభకోణంలో చంద్రబాబు ఆధారాలతో సహా దొరికిపోయారని చెప్పా రు. అమరావతిలో చేపట్టిన తాత్కాలిక సచివాలయ నిర్మాణ నిధుల్లోనూ చేతివాటం చూపించారని ఆరోపించారు. నేడు జగనన్న పాలనతో సుభిక్షంగా ఉందనీ, రామరాజ్యం కావాలంటే జగనన్న నిరంతరం ముఖ్యమంత్రిగా ఉండాలని చెప్పారు.



పాలసముద్రం మండలంలో మట్టల పండుగ సందర్భంగా ఆదివారం ఈత ఆకులు, పుష్పాలు చేతబట్టి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు. – పాలసముద్రం

విజయోస్తు!

భావి జీవితాన్ని మలుపు తిప్పే తరుణం ఆసన్నమైంది. పది పబ్లిక్ పరీక్షలతో విద్యార్థుల ఉజ్వల భవితకు తొలి అడుగుపడనుంది. పిల్లల ఆశలు, తల్లిదండ్రుల ఆకాంక్షలకు పునాది రాయి పడనుంది. ఇన్నాళ్లూ రాత్రింబవళ్లు పుస్తకాలే నేస్తాలై పరీక్షలకు సన్నద్ధయ్యారు. కోటి ఆశలతో పది విద్యార్థులు తుది పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు.

- నేటి నుంచి పది పబ్లిక్ పరీక్షలు
- పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నో మొబైల్ జోన్‌లుగా పరీక్ష కేంద్రాలు
- ఫిర్యాదులకు 8106232224



చిత్తూరులోని పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన డెస్కులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని కేంద్రాల్లో బల్లలు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా మౌళిక వసతులను సమకూర్చారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌లుగా ప్రకటించారు. ఎవరైనా పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్, కార్పొరేట్, ఇతర యాజమాన్యాల పరీక్ష కేంద్రాల్లో బయటివ్యక్తులు లోపల లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష జరిగే సమయంలో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని అధికారులు సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కేంద్రాలకు రాకపోకలు సాగించే సమయాల్లో హాల్‌టికెట్‌ను ఆర్టీసి సిబ్బందికి చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. అన్ని మార్గాల్లో ఈ సదుపాయం ఉంటుందని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. సమస్యలను కమాండ్ కంట్రోల్ రూం 8106232224కు తెలియజేయాలని అధికారులు సూచించారు.

కోడ్‌తో కట్టడి..

ప్రశ్నపత్రం లీక్ కాకుండా ఏడంకెల కోడ్‌ను అమలు చేస్తున్నారు. ఒకవేళ ప్రశ్నపత్రం లీకై నట్టయితే ఏ పరీక్ష కేంద్రం నుంచి లీకైందో కూడా స్పష్టంగా తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రశ్నాపత్రాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్ల నుంచి నిర్దేశించిన సమయానికి అరగంట ముందు మాత్రమే పోలీసు బందోబస్తు నడుమ తరలిస్తారు.

పది పరీక్షల సమాచారం

పరీక్ష కేంద్రాలు	115
బాలురు	11,440
బాలికలు	10,556
మొత్తం విద్యార్థులు	21,996
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	6
చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు	230
ఇన్విజిలేటర్లు	1260

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి



జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ప్రతి కేంద్రం వద్ద తాగునీటి సౌకర్యం, వైద్యశిబిరం వంటి అన్ని వసతులు కల్పించాం. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాస్తే సత్ఫలితాలు వస్తాయి. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు.

– మువ్వారామలింగం, పది పరీక్షల అబ్జర్వర్

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేశాం. విద్యార్థులు ముందస్తుగా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు విస్తృతంగా ఉంటాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం.

– విజయేంద్రరావు, డీఈవో, చిత్తూరు

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం పెద్దకొట్టాయి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని కోట మండపానికి వేంచేపు చేశారు. అక్కడ మూడు ప్రదక్షిణలు చేసి మండపంలో అధిష్టింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పెద్దిరాజు, చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోటర్‌సైకిల్ ఆటో ఢీ: ఆరుగురికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల వద్ద ఆదివారం మోటర్‌సైకిల్ ఆటో ఢీ కొని ఆరుగురికి గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ గజేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు, కాటప్పగారిపల్లెకు చెందిన చెంగల్‌రాయులు కుటుంబ సభ్యులు, బంధువులు బోడబండ్ల గ్రామంలో దశదిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆటోలో వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తరువాత ఆటోలో స్వగ్రామానికి బయల్దేరారు. బోడబండ్ల సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంగల్‌రాయులు, దొరస్వామి, ప్రభాకర్, వెంకటేష్, ధనుష్, మోటర్ సైక్లిస్ట్ సునీల్ గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స కోసం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చౌడేపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దాదేపల్లె సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లెకు చెందిన లక్ష్మీపతి రాజు భార్య సుష్మ (32)స్కూటీలో దాదేపల్లె నుంచి చౌడేపల్లె వైపు బయల్దేరింది. అయితే తలకు తీవ్రగాయాలతో రోడ్డు మీద పడి మృతి చెందింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకొన్న ఎస్‌ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైబర్ నెట్‌తో విస్తృత సేవలు



ఫైబర్‌నెట్ కనెక్షన్‌తో ఇంటర్‌నెట్, టీవీ, ఫోన్ సదుపాయం

చిత్తూరు కార్పొరేషన్: బీఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్ నెట్‌తో సేవలను విస్తృతం చేస్తోంది. టీవీ, కంప్యూటర్, ఫోన్ దాదాపు అన్ని ఇళ్లలో ఉన్నాయి. వీటి పరంగా ప్రైవేటు నెట్‌వర్క్‌లు పలు ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తోంది. వారికి పోటీగా ఒక కనెక్షన్‌తో బీఎస్‌ఎన్‌ఎల్ 3 సేవలను అందిస్తోంది. ఇంటర్‌నెట్, డిష్, ల్యాండ్‌ల్యాన్ సదుపాయం కలిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం కొత్త పథకం ద్వారా 100 సర్వీసులను ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సమయంలో బీఎస్‌ఎన్‌ఎల్ ప్లాన్‌ను తీసుకొని వాటి ద్వారా కంప్యూటర్లకు నెట్ వాడుకున్నారు.

అందుబాటులో...

టీవీకి డిష్, కంప్యూటర్‌కు నెట్, ల్యాండ్‌లైన్ ఇలా 3 రకాల కనెక్షన్లు ఇస్తాం. అలా కాకుండా ఫైబర్ నెట్ తీసుకుంటే ఒకే కనెక్షన్‌తో మూడు సేవలు పొందవచ్చు. రూటర్, మోడెం సదుపాయంతో ఒకే బాక్స్ నుంచి వీటిన్నింటికీ కనెక్షన్ ఇస్తున్నారు. ఉల్కా టీవీ సౌజన్యంతో ఇంటర్‌నెట్ టీవీ సర్వీసులను ప్రారంభించారు.

ఉద్యమి భారత్ కింద మోడెం ఫ్రీ

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నెట్ సౌకర్యం పెంచడానికి ఉద్యమి భారత్ పథకం తీసుకొచ్చింది. జిల్లాలోని పది మండలాల్లో 266 ప్రాంతాలు వీటికి ఎంపికైంది. తొలుతగా నరహరిపేట, పాలకల, తలపులపల్లె ప్రాంతాల్లో వీటిని అమలు చేస్తున్నారు. ఇక్కడ నెట్ ప్లాన్ చెల్లిస్తే చాలు ఉచితంగా మోడెం ఇచ్చి సర్వీసు అందించనున్నారు. ఇది గ్రామీణులకు ఎంతో సౌలభ్యంగా ఉంది. రూ.390తో నెలకు 1000 జీబీ డేటాను 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో, ఇంటర్‌నెట్‌తో పాటు అన్‌లిమిటెడ్ కాల్స్ ఇస్తున్నారు..

ప్యాకేజీలు ఇలా...

4 జీ స్పీడ్‌తో 1000 జీబీ డేటా 20 ఎంబీపీఎస్‌తో స్పీడ్‌తో ఇంటర్‌నెట్, ఫోన్‌కాల్స్, తెలుగు ఛానల్స్ హెచ్‌డీ సదుపాయంతో నెల రోజులకు ప్లాన్ రూ. 690కు అందుబాటులో ఉంచారు. నెలకు 3,300 జీబీ డేటా 30 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇస్తున్నారు. అదే రూ.599 ప్లాన్‌తో 60 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా సదుపాయం కల్పించారు. రూ.645 డేటా ప్లాన్‌తో 100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా ఇస్తున్నారు. రూ.799 ప్యాక్‌తో 3,300 జీబీ డేటా 100 ఎంబీపీఎస్ స్పీడ్ ఇస్తున్నారు. ఇందులో అదనంగా ఓటీటీలోని సోనిలైవ్, హాట్‌స్టార్, జీ ఫైవ్, సినిమాప్లస్ ప్లాట్‌ఫామ్స్ అందిస్తున్నారు. అదే రూ.999 ప్యాక్‌తో 150 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 3,300 జీబీ డేటా, రూ.2299 ప్లాన్‌తో 300 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4,500 జీబీ డేటాను అందిస్తారు. ఎంపిక చేసుకున్న ప్యాక్‌కు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించి సేవలు పొందవచ్చు. మోడెంకు రూ.3,500 చెల్లించి సేవలు వినియోగించుకోవాలి. అదే రూ.599 ప్యాక్‌ను 6 నెలల రీచార్జ్‌తో మోడెంను ఉచితంగా ఇచ్చే అవకాశం కల్పించారు.

అన్ని రంగాలకు అందుబాటులో..



గృహ, చిన్న కార్యాలయాలకు అనుగుణంగా బేసిక్ ప్యాకేజీతో పాటు వాణిజ్య సర్వీసులు, ఆఫీసులకు ఈ ప్లాన్‌తో ఎంతో ఉపయోగకరం. ఈ ధరకు ప్రైవేటు నెట్‌వర్క్‌లు ప్యాక్‌లు ఇవ్వలేకపోతున్నాయి. ఉల్కా టీవీ సౌజన్యంతో ఇంటర్‌నెట్ టీవీ సదుపాయం ఇస్తున్నాం. ఉద్యమి భారత్ ద్వారా నెట్ ప్యాక్ ప్లాన్ చెల్లిస్తే మోడెం ఉచితంగా ఇస్తున్నాం.

– సురేంద్ర, డీఈ బీఎస్‌ఎన్‌ఎల్



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,560

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	24
తిరుపతి	37	24
తిరుమల	33	21
గూడూరు	38	27
నగరి	38	26

లేగ దూడను కాపాడిన ఫైర్ సిబ్బంది

పుంగనూరు: పట్టణంలోని పోలీస్‌లైన్‌లో రెండుగోడల మధ్య ఇరుక్కుపోయిన లేగదూడను ఫైర్ సిబ్బంది కాపాడారు. పోలీస్‌లైన్‌లో ఆదివారం రెండు ప్రహరీల మధ్య మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు దూడ మధ్యలో ఇరుక్కుపోయింది. విషయం తెలుసుకుని పట్టణవాసులు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజుకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దూడకు ఎలాంటి గాయాలు కాకుండా సిబ్బంది జాగ్రత్తగా గోడలు కింది భాగం తొలగించి కాపాడారు. స్థానికులు ఫైర్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సుమన్, వెంకటరమణ, రాజశేఖర్, ఇమానియల్ పాల్గొన్నారు.



లేగ దూడను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన అగ్నిమాపక సిబ్బంది

సీఎంకు అక్కా చెల్లెమ్మల ఆశీర్వాదం

- వైఎస్సార్ ఆసరా సభలో ఎంపీ రెడ్డెప్ప

శాంతిపురం: రాష్ట్రంలోని అక్కా చెల్లెమ్మలు ఆశీర్వాదం జగన్నకు పుష్కలంగా ఉన్నాయని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చెప్పారు. మండల కేంద్రంలో ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ సభలో ఆయన ప్రసంగించారు. మహిళల ఆశీస్సులతో 2019లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ బలం క్రమంగా పెరుగుతూ ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంతో సహా అన్ని చోట్లా తిరుగులేని విజయాలు దక్కాయని చెప్పారు. దివంగత ఎన్టీఆర్ పెట్టిన పార్టీలో చేరిన చంద్రబాబు తర్వాత ఆయన కుర్చీ లాక్కుని ప్రాణం పోవటానికి కారణం అయ్యారని గుర్తు చేశారు. చేసిన పాపాలు పండటంతో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి 30 ఏళ్ల వయసున్న భరత్ చేతిలో కుప్పంలో ఓడిపోనున్నారని చెప్పారు. భరత్‌ను కుప్పం ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని వెయ్యి డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న 8,680 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ 9.17 కోట్ల చెక్కును అందజేశారు.

రూ.3 లక్షల కోట్లు

నాలుగేళ్లలో రాష్ట్రంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.3 లక్షల కోట్ల నిధులు పంపిణీ చేసినట్లు చిత్తూరు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు చెప్పారు. అక్కచెల్లెమ్మల కోసం దివంగత వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సున్నా వడ్డీ పథకానికి చంద్రబాబు మంగళం పాడితే జగనన్న మళ్లీ అమలు చేస్తున్నారని అన్నారు. అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు ఇవ్వాలన్నా, పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువులు అందించాలన్నా కోర్టు కేసులతో వాటిని అడ్డుకున్నది ఎవరో అందరికీ తెలుసన్నారు.

కుప్పం జనాన్ని ఓటర్లుగానే చూశారు

చంద్రబాబు కుప్పం ప్రజలను కేవలం ఓటర్లుగా చూశారని, ఎప్పుడూ ఇక్కడి ప్రజల కష్టాలను పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. కరోనా వంటి ఆపత్కాలంలో కూడా ఆయన ఇటువైపు తొంగి చూడలేదని గుర్తుచేశారు. బాబు తీరును, ఆయన హయాంలో జరిగిన నష్టాన్ని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిన పథకాలను బేరీజు వేస్తున్న కుప్పం జనం సరైన తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ, శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కోదండరెడ్డి, నాయకులు చక్రపాణి రెడ్డి, చెంగప్ప, నిసార్, రఘురామిరెడ్డి, పెద్దన్న, కృష్ణమూర్తి, సుబ్బరాజులు, సుకుమార్, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కారు-బైక్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

వడమాలపేట: కారు–స్కూటర్ ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు, పాదిరేడుకు చెందిన రావిళ్ల ప్రతాప్‌నాయుడు కుమారుడు వినోద్(24), తల్లి గిరిజమ్మ ఇద్దరూ కలిసి తిరుపతి–చెన్నై జాతీయ రహదారి పక్కన పాదిరేడు జంక్షన్ వద్ద ఉన్న పొలాల దగ్గరకు ఉదయం ద్విచక్రవాహనంపై బయల్దేరారు. పాదిరేడు రోడ్డు జంక్షన్ వద్ద తిరుపతి నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు, ఆయన తల్లికి గాయాలు కావడంతో స్థానికులు వారిని అదే కారులో రేణిగుంట వద్ద ఉన్న అమర హాస్పిటల్‌కు తరలించారు. కారు డ్రైవర్ వారిని హాస్పిటల్లో చేర్పించి కారుతో పరారయ్యారు. వినోద్‌కు తలలో బ్లడ్ క్లాట్ అయివుండడంతో 24 గంటలు గడిచితేగాని చెప్పలేమని డాక్టర్లు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి, కారు కోసం దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు- బైక్

పోటీతో మేధస్సు వృద్ధి



విజేతకు బహుమతిని అందజేసిన కమిషనర్ అరుణ

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు పోటీ వాతావరణంలో మేధస్సు వృద్ధి చెందుతుందని నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం సౌత్ జోన్ స్మార్ట్ కిడ్ అబాకస్ గణిత పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా వచ్చారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాల్ని ప్రదానం చేశారు. అబాకస్, వేదిక్ గణితం, చదరంగం ఇతర అంశాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి శోభారాణి, నిర్వాహకులు పల్లవి తదితరులు పాల్గొన్నారు.

తిరుత్సవం... పరిపూర్ణం



వేదికపై అలరిస్తున్న డీజే డ్యాన్సర్ నైనా సూర్తె



బైక్‌పై సాహసోపేత విన్యాసాలు

ఏర్పేడు / రేణిగుంట: ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో మూడురోజులుగా నిర్వహిస్తున్న తిరుత్సవ–2023 వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పర్యవేక్షణలో సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆఖరి రోజు నిర్వహించిన ఏస్ ఆఫ్ బార్డర్ ల్యాండ్ ఫైనల్స్, కేబీసీ షో, సరికొత్త ఆవిష్కరణల ఈవెంట్ ఐడియాథాన్, జనరల్ క్విజ్, స్పిన్ ఏ యార్న్, కేటీఎం బైక్ షో కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్యాంపస్‌లో విభిన్న చిత్రాలు, పోస్టర్లను ప్రదర్శించారు. రాత్రి కన్సన్ మెంటర్ షో ఆకట్టుకుంది.

ఫుల్‌జోష్‌తో డీజే నృత్యాలు

ప్రఖ్యాత డీజే నృత్యకారిణి, మ్యూజిక్ ఆర్టిస్ట్ నైనా సూర్తె బృందంచే ప్రదర్శితమైన డీజే నృత్యాలు ముగింపు ఉత్సవ శోభను రెట్టింపు చేశాయి. ఐఐటీ విద్యార్థులు స్టేజ్ ముందు నృత్యాలు చేసి, పాటలకు అనుగుణంగా చప్పట్లు, కేరింతలతో వేడుకలకు ముగింపు పలికారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగులు, హుషారెత్తించే మ్యూజికల్ సౌండ్స్, పాప్ గీతాలకు సుమారు రెండు గంటలకు పైగా నృత్యాలు చేస్తూ తిరుత్సవ–2023 సంబరాలను పరిపూర్ణం చేశారు.

ఊరించి ఉసూరుమనిపించి..

- పడిపోయిన టమాటా ధరలు
- రెండు వారాలకు ముందు బాక్సు ధర రూ.300
- ప్రస్తుతం బాక్సు ధర రూ.100
- మార్కెట్లకు సరుకు ఎక్కువ కావడమే కారణం



పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్ పరిధిలో రెండు వారాలకు ముందు టమాటా బాక్సు (14 కిలోలు) ధర రూ.300 దాటింది. రోజురోజుకూ ధరలు తగ్గుతూ ఆదివారానికి బాక్సు ధర వందకు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, లోకల్ సరుకు రావడం, కొన్ని తోటల్లో మరదాం కాయలు కోతకు వస్తుడడంతోనే ధరలు తగ్గుముఖానికి కారణమైందని స్థానిక మండీ వ్యాపారులు చెబుతున్నారు. బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు వస్తున్నప్పటికీ సరుకు పెరగడంతో ధరలు పతనమవుతున్నట్టు తెలుస్తోంది.

రెండు వారాలకు తగ్గుముఖం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలలో పెద్ద టమాటా మార్కెట్లున్నాయి. గతంలో కోవిడ్ కారణంగా మార్కెటింగ్ లేక రైతులు పూర్తిస్థాయిలో టమాటాను సాగుచేయలేదు. దీంతో ఈ సీజన్‌లో సాగు పెరిగింది. రెండు వారాల క్రితం బాక్సు రూ.340గా ఉంటూ తగ్గుతూ వచ్చి ఇప్పుడు వందకు పడిపోయింది. మళ్లీ వర్షాలు కురుస్తుడడంతో కాయ నాణ్యత తగ్గి ధర తగ్గే అవకాశం కనిపిస్తోంది.

పెరుగుతున్న సరుకు

ఈ సీజన్‌లో డివిజన్‌కు సంబంధించి 3వేల హెక్టార్లలో తోటలు కోతదశలో ఉన్నాయి. దీంతో మార్కెట్లకు సరుకు ఎక్కువగా చేరుతోంది. ప్రస్తుతం మార్కెట్లకు రోజుకు 80 నుంచి 90 లారీల సరుకు వస్తోంది. ఫలితంగా ధరలు తగ్గుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు అనంతపురం జిల్లా నుంచి సరుకు స్థానిక మార్కెట్లకు చేరుతోంది. ఇంకా తమిళనాడులో కోతలు మొదలు కాలేదు. ఆ రాష్ట్రంలోని క్రిష్ణగిరి, రాయకోట, దిండిగల్, ఉడుమాల్‌పేటైలలో సరుకు మరో 20 రోజుల్లో కోతకొస్తుంది. అక్కడ సరుకు మొదలైతే తమిళనాడు వ్యాపారులకు రవాణా కష్టం తగ్గుతుంది కాబట్టి అక్కడే కొనుగోళ్లు చేస్తారు. దీంతో ఇక్కడి మార్కెట్లకు తమిళనాడు వ్యాపారులు రారు. దీంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంటుందనే భయం రైతులకు పట్టుకుంది.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో

- వేసవిలో టమాటా సాధారణ సాగు 5వేల హెక్టార్లు
- ప్రస్తుతం సాగైన పంట 4వేల హెక్టార్లు
- ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు 3వేలహెక్టార్లు
- మండీలకు ప్రస్తుతం వస్తున్న టమాటాలు 80 లారీలు

రూ.300కు తగ్గితే నష్టమే



టమాటా పంటను ఎకరాలో సాగు చేయాలంటే ఇప్పుడున్న ధరల్లో దుక్కిదున్నడం, ఎరువులు, మల్చింగ్‌షీట్, సీడ్స్, కర్రలు, డ్రిప్పు ఎరువులు, టేప్, ట్వైన్, కూలీలు, మార్కెటింగ్ ఖర్చులు కలిపి ఎకరానికి రూ.1.6 లక్షల దాకా ఖర్చు వస్తుంది. ఎకరానికి సగటున వెయ్యి బాక్సులు కోస్తే ఇప్పుడున్న ధరల మేరకు రూ.లక్ష మాత్రమే వస్తుంది. అదే రూ.300గా ఉంటే రూ.3లక్షలు వస్తుంది. రైతు పెట్టుబడి రూ.1.6 లక్షలు పోగా ఆదాయం రూ.1.40 లక్షలు దాకా ఉంటుంది.

– శ్రీనివాసులు, మొరం, పలమనేరు మండలం

ధర ఎప్పుడుంటుందో తెలియదు



టమోటా ధరలు నిలకడగా ఉండవు. మొన్నటిదాక పలికిన ధరలు ఇప్పుడులేదు. రైతుకు లాభదాయకంగా ఉండాలంటే బాక్సు రూ.300 వరకూ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ధరలు తగ్గుముఖం పడితే మాకు కూడా నష్టమే. ఏదో వ్యాపారం చేయాలి కాబట్టి చేస్తూ అలా నెట్టుకురావాల్సిందే.

– మండీ సుధా, టమాటా మండీ యజమాని, పలమనేరు